

సాక్షి
బాపట్ల
గురువారం । 19 । సెప్టెంబర్ । 2024



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్(దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద బుధవారం 7026 క్యూసెక్కులు వదిలారు. బ్యాంక్ కెనాల్‌కు 1645 క్యూసెక్కులు వదిలారు.



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు నుంచి 51,042 క్యూసెక్కులు దిగువకు వదులుతున్నారు. ఎగువ నుంచి 51,042 క్యూసెక్కులు వచ్చి ప్రాజెక్టులో చేరుతుంది.

శివాలయంలో స్వచ్ఛతా హి సేవ



పెదకాకాని: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వచ్ఛతా హి సేవ-2024 కార్యక్రమంలో భాగంగా బుధవారం పెదకాకాని శివాలయంలో మొక్కలు నాటారు.

నాడు ప్రగల్భాలు



ఎన్నికల ముందు మే 1న బాపట్ల జిల్లా చీరాలలో జరిగిన బహిరంగ సభలో అప్పటి టీడీపీ అధినేత, ప్రస్తుత సీఎం నారా చంద్ర బాబు నాయుడు సూపర్ -6 పథకాలపై ఊదరగొట్టారు. బూటక హామీలతో ప్రజలను నమ్మించారు. ఇప్పుడు అమలు సాధ్యం కాదంటూ మొసలి కన్నీరు కారుస్తున్నారు.

మాయా మేనిఫెస్టో

ఎన్నికల ముందు టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ఇద్దరూ ఉమ్మడి కార్యాచరణ ప్రణాళిక(మేనిఫెస్టో) ప్రకటించారు. అందులో సూపర్-6 పథకాలకు తమ ప్రాధాన్యమని నొక్కివక్కాణించారు. పవన్ కళ్యాణ్ మరో అడుగు ముందుకేసి అధికారంలోకి వచ్చాక ఈ హామీలు అమలు చేయించే బాధ్యత తనదని ఘంటాపథంగా చెప్పారు. ఇప్పుడు ఏమీ మాట్లాడకుండా మిన్నకుండిపోయారు.




నంగనాచి బాబు



పగలే చుక్కలు చూపించే ఘనుడు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆయన ఎన్నికల ముందు బాపట్లలో నిర్వహించిన సభలో సంపద సృష్టించి సూపర్-6 పథకాలు అమలు చేస్తానంటూ బీరాలు పోయారు. ఇప్పుడు పథకాలు అమలు చేయాలంటే భయమేస్తోందంటూ నంగనాచి కబుర్లు చెబుతున్నారు.

ఆరు నారా కతలు





6

1. తల్లికి వందనం ఎప్పుడిస్తారు? మా వద్దకు డేటా ఇంకా రాలేదు..
2. రైతు పెట్టుబడి సాయం తేదీ చెప్పలేదు.. ఇంకా ఏమీ అనుకోలేదు..
3. దీపావళికి గ్యాస్ వెలిగేనా? అమలుపై సీఎం ప్రకటన
4. ఆర్టీసీలో ఉచిత ప్రయాణమెప్పుడో? కసరత్తు చే..స్తున్నాం.
5. నిరుద్యోగ భృతి సంగతేంటి? అమ్మో ఆర్థిక సంక్షోభంలో ఉన్నాం..
6. మహిళలకు నెలకు రూ.1,500 ఇస్తామన్నారు? రోడ్ మ్యాప్‌లవీ పూర్తిచేశాక ఆలోచిద్దాం

నింగిని నేలకు దించుతా.. సంపద సృష్టిస్తా.. పేదలను ఉన్నపళంగా లక్షాధికారులను చేసేస్తా.. సూపర్ సిక్స్‌తో రాష్ట్రాన్ని పరుగులు పెట్టిస్తా అంటూ ఎన్నికల ముందు బీరాలు పోయిన బడాయి బాబు మాటలు బూటకమేనని తేలిపోయింది. అబద్ధపు హామీల ముసుగు తొలగిపోయింది. 'తల్లికి వందనం' అంటూ పెట్టిన పంగనామాలతో 'అమ్మఒడి' తల్లడిల్లుతోంది. భరోసాతో కులాసాగా సాగిన రైతు 'అన్నదాతా సుఖీభవ' అంటూ చేసిన వంచనపై భగ్గుమంటున్నాడు. చేయూత, ఆసరాతో సిరులతో తులతూగిన అబల నెలకు రూ.1500 అంటూ చేసిన దగాపై దునుమాడుతోంది. ఇంటింటికీ మూడు గ్యాస్ సిలిండర్లు అన్నమాట 100 రోజుల పాలనలో అమలుకాలేదు. ఉచిత ప్రయాణం అంటూ పెట్టిన 'బస్'మాసుర హస్తాన్ని ఆయన తలపైనే పెట్టాలని దేవుడిని వేడుకుంటోంది. ఇంటికో ఉద్యోగం.. నెలకు రూ.మూడువేల నిరుద్యోగ భృతి అంటూ నెత్తిన టోపీ పెట్టిన మాయాకూటమిపై యువ గళం దళమై గర్జిస్తోంది. హామీలు అమలుకు సర్వత్రా డిమాండ్ వ్యక్తమవుతోంది.



సాక్షి ప్రతినిధి, బాపట్ల: ఎన్నికలకు ముందు సూపర్ సిక్స్ అంటూ ఊదరగొట్టిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గద్దెనెక్కాక గళం మార్చారు. ఏరుదాటాక బోడిమల్లన్న అన్న చందంగా రాష్ట్రం అప్పుల్లో ఉందని, ఇచ్చిన హామీల అమలు సాధ్యం కాదంటూ అసెంబ్లీ సాక్షిగా మొసలి కన్నీరు కారుస్తున్నారు. ఫలితంగా సర్వత్రా ఆగ్రహం వెల్లువెత్తుతోంది. ఎన్నికల ముందు గాలిలో డబ్బులు సృష్టిస్తానంటూ ప్రగల్భాలు పలికిన చంద్రబాబు ఇప్పుడు ఏం చేయాలో చెప్పాలని ఎమ్మెల్యేలను అడగడం గమనార్హం. హామీల అమలు నుంచి తప్పించుకునేందుకు గత ప్రభుత్వంపై అభాండాలు వేస్తున్నారు. గత ప్రభుత్వం లెక్కకుమించి అప్పులు చేసిందని శ్వేతపత్రాలతో శ్వేతనాగులా విషంగక్కుతున్నారు. దీంతో ప్రజలు బాబుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ తూచా తప్పకుండా అమలు చేసిన వైనాన్ని గుర్తు చేసుకుంటున్నారు.

బాబు ఏదీ జవాబు

తల్లికి వందనం..



తల్లికి వందనం పేరిట జిల్లాలో ఉన్న మొత్తం **2,35,654** మంది పిల్లలకు రూ.**15,000** చొప్పున ఇవ్వాల్సిన మొత్తం రూ. **353.48** కోట్లు

తల్లికి వందనం కోసం నిరీక్షిస్తున్నా



మాది పట్టణంలోని డ్రైవర్స్‌కాలనీ, నాకు ఇద్దరు పిల్లలు నా ఇద్దరి పిల్లలను పట్టణంలోనే ప్రైవేటు స్కూల్లో చదివించుకుంటున్నాను. నేను పట్టణంలోని సంపన్నుల ఇళ్లల్లో పాచి పనికి వెళ్తుంటాను. నా భర్త తాపీపని చేస్తుంటాడు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికలకు ముందు చెప్పిన విధంగా మా పిల్లలకు ఒక్కొక్కరికి రూ. 15 వేలు చొప్పున ఎప్పుడు అందిస్తారోనని ఎదురుచూస్తున్నాం. మాలాంటి పేదలను ప్రభుత్వం ఆదుకోవాలి. తక్షణం తల్లికి వందనం అమలు చేయాలి చంద్రబాబు మాట నిలబెట్టుకోవాలి.

– శిరీష, డ్రైవర్స్ కాలనీ, బాపట్ల

అన్నదాత సుఖీభవ



ఒక్కో రైతుకు **20,000** చొప్పున మొత్తం **1,92,037** మంది రైతులకు కూటమి ప్రభుత్వం ఇవ్వాల్సిన మొత్తం రూ.**384.06** కోట్లు

రైతు అంటే అలుసా!



గతంలో సీఎం వైఎస్ జగన్ ఖరీఫ్ సీజన్ ఆరంభం నాటికే రైతు భరోసా సొమ్మును ఖాతాల్లో జమ చేసే వారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై చాలా రోజులైనా ఇప్పటి వరకు కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ ద్వారా రూ.20 వేలు ఇవ్వలేదు. ఇస్తామని చెప్పి మరిచారు. వర్షాలూ పడుతున్నాయి. పంటలు సాగు చేసుకోవాలంటే ఈ సహాయం ఎంతగానో ఉపకరిస్తుంది. రైతులపై ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి విడనాడాలి. తక్షణం అన్నదాతా సుఖీభవ అమలు చేయాల్సిందే.

– మాచర్ల హేమసుందరరావు, ఐలవరం, భట్టిప్రోలు

నిరుద్యోగ భృతి



జిల్లాలో ఉన్న గృహాలు : **4,77,557**
ఇంటికొక నిరుద్యోగి చొప్పున మొత్తం సంఖ్య : **4,77,557**
నెలకు రూ.3వేలు చొప్పున మొత్తం అందాల్సింది రూ.**143.26** కోట్లు

భృతి చెల్లించాల్సిందే



రాష్ట్రంలో ఉన్న నిరుద్యోగులందరికీ ఎన్నికల హామీ ప్రకారం నిరుద్యోగ భృతి చెల్లించాలి. సీఎం చంద్రబాబునాయుడు సంపద సృష్టించి సంక్షేమ పథకాలు అమలు చేస్తానని ఎన్నికలలో ప్రజలకు వాగ్దానం చేశారు. ఇంటికో ఉద్యోగం ఎప్పుడిస్తారు? నిరుద్యోగ భృతి ఎప్పటి నుంచి చెల్లిస్తారో చంద్రబాబు, ఆయనకు వంతపాడిన పవన్ కల్యాణ్ చెప్పాల్సిందే.

అక్కల శ్రీనివాసరెడ్డి, సర్పంచ్, పెదపులుగువారిపాలెం

వైఎస్ జగన్ ఐదేళ్లలో చేసిన సంక్షేమ కార్యక్రమాలు



వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో బాపట్ల జిల్లాలో సంక్షేమం ఇంటింటి తలుపు తట్టింది. ఇచ్చిన హామీ ప్రకారం సంక్షేమ క్యాలెండర్ ఏర్పాటు చేసి మరీ హామీలు అమలు చేశారు. అమ్మ ఒడి, రైతు భరోసా, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా, విద్యా దీవెన, వసతి దీవెన.. ఇలా ఒకటా రెండా ఇచ్చిన ప్రతి హామీ అమలైంది. ఇంటింటా సంక్షేమం వెల్లివిరిసింది.

జగనన్న అమ్మ ఒడి



1,16,019 లబ్ధిదారుల సంఖ్య
రూ.**489** కోట్లు నగదు లబ్ధి

వైఎస్సార్ రైతు భరోసా



1,92,037 లబ్ధిదారుల సంఖ్య
రూ. **1181** కోట్లు నగదు లబ్ధి

వైఎస్సార్ ఆరోగ్యశ్రీ




1,37,421 లబ్ధిదారుల సంఖ్య
రూ.**331.83** కోట్లు నగదు లబ్ధి

జగనన్న వసతి, విద్యా దీవెన

లబ్ధిదారుల సంఖ్య **30,611**
నగదు లబ్ధి రూ.**29.16** కోట్లు
లబ్ధిదారుల సంఖ్య **31,046**
నగదు లబ్ధి రూ.**92.28** కోట్లు

మనబడి నాడు-నేడు



1433 ఆధునికీకరించిన పాఠశాలలు
రూ.**304.12** కోట్లు ఖర్చు చేసిన మొత్తం


వైఎస్సార్ చేయూత



85,846 లబ్ధిదారుల సంఖ్య
రూ.**439.13** కోట్లు నగదు లబ్ధి

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం

ప్రతిరోజూ తిరుగుతున్న బస్సులు : **284**
ప్రస్తుతం ప్రయాణికుల సంఖ్య : **99,200**
ఉచిత ప్రయాణం అమలుతో ప్రయాణికుల సంఖ్య : **1,38,880**
ఉచిత ప్రయాణం కోసం నిరీక్షిస్తున్న మహిళల సంఖ్య : **90,000**



వెంటనే అమలు చేయాలి



మహిళలందరికీ ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని కూటమి ప్రభుత్వం వెంటనే అమలు చేయాలి. ఎన్నికల ప్రచారంలో పదేపదే ఉచిత బస్సు ప్రయాణం గురించి చెప్పారు. కూటమి ప్రభుత్వం రాగానే అమలు చేస్తామన్నారు. ఇప్పటి వరకు పథకంపై నోరుమెదపక పోవటం బాధాకరం. వెంటనే అమలు చేయాలి.

– ఎస్తేరురాణి, బేతపూడి, రేపల్లె మండలం

మహిళలకు ప్రతి నెలా రూ.1500



మహిళకు నెలకు రూ.**1500**
జిల్లాలో 18 నుంచి 59 ఏళ్ల మధ్య ఉన్న మహిళల సంఖ్య : **6,61,841**
వీరికి ఒక్కొక్కరికీ నెలకు రూ.1500 చొప్పున ఏడాదికి ఇవ్వాల్సిన మొత్తం రూ.**11,913** కోట్లు

బాకా ఊది మరిచారు



ఎన్నికల ముందు మహిళలకు ప్రతి నెలా రూ.1500 ఇస్తామని కూటమి నేతలు బాకా ఊదారు. ప్రతి ప్రచార సభలోనూ ఊదర కొట్టారు. గద్దెనెక్కాక హామీలు అమలు చేయకుంటే ఎలా? రూ.1,500 ఎప్పుడు ఇస్తారా అని వెయ్యి కళ్లతో ఎదురు చూస్తున్నాం. త్వరగా హామీ అమలు చేయాలి. తాను ఎంతో అనుభవంతుడినని చెప్పుకునేచంద్రబాబు ఇలా ప్రజలను దగా చేయడం సరికాదు.

–రెబ్బా మున్ని, అళ్లమూడి, భట్టిప్రోలు

ఏటా మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితం



జిల్లాలో మొత్తం గ్యాస్ కనెక్షన్లు : **4,60,838**
ఒక్కొక సిలిండర్ ధర ప్రస్తుతం : రూ. **900**
3 ఉచిత సిలిండర్లకు : రూ.**2,700**
ఈలెక్కన ఏడాదికి ప్రభుత్వం భరించాల్సింది : రూ.**124.42** కోట్లు

ఉచితంగా సిలిండర్లు ఇవ్వాలి

తెలుగుదేశం పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించినట్టే ఉచిత గ్యాస్ సిలిండర్లు అందజేయాలి. ప్రభుత్వం ఆదుకుటుందనే ఉద్దేశంతోనే ప్రజలు అధికారం అప్పగించారు. సీఎం చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం ప్రతి కుటుంబానికీ సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇవ్వాలి. పాలన 100 రోజులు పూర్తి చేసుకున్నా సిలిండర్లు ఏ ఇంటి గడపకు చేరలేదు.

– యారం బాబూరావు, పెదగొల్లపాలెం, కర్లపాలెం మండలం

అభివృద్ధి, సంక్షేమం లక్ష్యాల సాధనకు కృషి

జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల: అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలలో 100 రోజుల లక్ష్యాన్ని చేరుకునేలా అధికారులు కృషిచేయాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన 100 రోజుల లక్ష్యాలు, వార్షిక ప్రణాళికపై జిల్లా అధికారులతో బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో ఆయన సమీక్ష నిర్వహించారు. సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా అధికారులు పనిచేయాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి వంద రోజులు లక్ష్యాలను ప్రతిష్టాత్మకంగా భావిస్తుందన్నారు. ఈ నేపథ్యంలో అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. రక్తహీనత, పోషణ లోపం నివారణపై వైద్య అధికారులు దృష్టి పెట్టాలన్నారు. 10 కిలోమీటర్ల సీసీ రోడ్ల నిర్మాణం లక్ష్యంగా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు ముందుకు సాగాలన్నారు. 1,470 గృహాల నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యం మేరకు 590 గృహాలు ఇప్పటికే పూర్తయ్యాయన్నారు. అక్టోబర్ రెండో తేదీ నాటికి పూర్తి లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. మహిళ శిశు సంక్షేమ శాఖ అధికారులు ప్రభుత్వం మార్గదర్శకాలను అనుసరించి లక్ష్యాలను అధిగమించాలన్నారు. రైతు బజార్ల పునఃప్రారంభించడానికి మార్కెటింగ్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. వాణిజ్య సముదాయాలు, వ్యాపార సంస్థల వద్ద కార్మికులకు షెడ్లు, విశ్రాంతి గదుల ఏర్పాటు, సంక్షేమంపై చర్యలు తీసుకోవాలన్నారు. లక్ష్య సాధనలో అధికారుల నిర్లిప్తంగా ఉండరాదన్నారు. సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు, సీపీఓ శ్రీనివాసరావు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

21లోపు భూముల వివరాలపై నివేదిక ఇవ్వండి

జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల: నిషేధిత భూముల జాబితా (22-ఏ) నుంచి తొలగించిన భూముల వివరాలపై ఈ నెల 21వ తేదీలోపు నివేదిక ఇవ్వాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తహసీల్దార్లను ఆదేశించారు. స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి బుధవారం ఆర్డీఓలు, తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ దీనికోసం గ్రామ, మండల స్థాయిలో కమిటీలు వేశామన్నారు. నివేదిక తయారీలో నిర్లిప్తంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. తప్పులు, పొరపాట్లు లేకుండా వివరాలు ఉండాలని స్పష్టం చేశారు. జాబితా నుంచి తొలగించిన భూముల క్రయ,విక్రయాలు క్రమపద్ధతిలో జరిగాయా, చట్టం ఉల్లంఘన జరిగిందా అనే అంశాలు స్పష్టంగా నివేదించాలన్నారు. జాబితా నుంచి తొలగించిన భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఆర్ఎస్ఆర్‌తో సరిచూసుకోవాలన్నారు. భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియలో చట్టాలను ఉల్లంఘించిన వాటిని తహసీల్దార్లు ధ్రువీకరించి నివేదిక పంపాలని సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. విచారణ అనంతరం తహసీల్దార్లు స్పష్టమైన నివేదిక ఇవ్వాలన్నారు. డీఆర్వో సత్తిబాబు ఉన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

108, 104 వాహనాల్లో పోస్టుల భర్తీకి ఆహ్వానం

రేపల్లె రూరల్: 108, 104 వాహనాల్లో డ్రైవర్ ఉద్యోగ ఖాళీలను భర్తీ చేసేందుకు నిరుద్యోగుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు 108 జిల్లా మేనేజర్ పి.బాలకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డ్రైవర్ పోస్టుకు 10వ తరగతి ఉత్తీర్ణులై, 35 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. హెవీ లైసెన్స్ ఉండటంతోపాటు ఇంగ్లీష్ చదవటం, రాయటం తెలిసి ఉండాలన్నారు. అర్హులైన వారు ఈ నెల 20వ తేదీలోపు చీరాల గవర్నమెంట్ ఏరియా హాస్పిటల్‌లోని రూమ్ నంబరు 25లోని 108 కార్యాలయంలో దరఖాస్తు చేయాలన్నారు. పూర్తి వివరాల కోసం 83095 30078, 63053 59961 నంబర్లలో సంప్రదించాలన్నారు.

పచ్చ దర్బార్!

- టీడీపీ కార్యాలయంలో ప్రజాదర్బార్
- సమావేశం నిర్వహించిన బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ
- మున్సిపల్ కమిషనర్‌తో పాటు అధికారులు హాజరు
- అక్కడే సమస్యలపై వినతుల స్వీకరణ
- నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన టీడీపీ ఎమ్మెల్యే
- పార్టీ కార్యాలయానికే రావాలంటూ అధికారులపై ఒత్తిడి
- బదిలీల భయంతో పచ్చపార్టీ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించిన అధికారులు
- ఎమ్మెల్యే, అధికారుల తీరుపై విమర్శలు
- ఉన్నతాధికారుల్లో చర్చనీయాంశంగా మారిన ప్రజాదర్బార్ అంశం

సాక్షి ప్రతినిధి,బాపట్ల: తెలుగుదేశం పార్టీ శాసనసభ్యులు బరితెగించారు. అధికారం మత్తులో రెచ్చిపోతున్నారు. తాము చెప్పిందే చేయాలంటూ అధికారులకు హుకుం జారీ చేస్తున్నారు. మాట వినని అధికారులకు బదిలీలంటూ బెదిరిస్తున్నారు. దీంతో కొందరు అధికారులు నిబంధనలకు తిలోదకాలిచ్చి, విలువలకు పాతరేసి పచ్చ ప్రజాప్రతినిధుల మోచేతి నీళ్లు తాగుతున్నారు. వారు చెప్పిందానికల్లా జీ హుజూరంటున్నారు. దీంతో ప్రజాప్రతినిధులు అధికారాన్ని అడ్డుపెట్టి నియంతల్లా వ్యవహరిస్తూ జనంలో పలుచనవుతున్నారు. తాజాగా బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని ఏకంగా జిల్లా టీడీపీ కార్యాలయంలో నిర్వహించడం, ఈ కార్యక్రమానికి అధికారులు సైతం హాజరై సమావేశాన్ని నడిపించడం వివాదాస్పదంగా మారింది.

అవగాహన లోపమా.. అధికార దర్పమా..?

బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ జిల్లా టీడీపీ కార్యాలయంలో మంగళవారం నుంచి ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నారు. పార్టీ కార్యాలయంలో నేతలు కూర్చునే వేదికనే ప్రజాదర్బార్ సమావేశ వేదికగా మార్చారు. బ్యాక్‌గ్రౌండ్‌లో టీడీపీ లోగో బ్యానర్‌ను అమర్చారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్‌తో పాటు ఇన్‌చార్జి తహసీల్దార్‌తోపాటు పలువురు రెవెన్యూ, మున్సిపల్, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది హాజరయ్యారు. ఉదయం రెండు గంటల పాటు కార్యక్రమం జరగ్గా ఎమ్మెల్యేతోపాటు అధికారులు ప్రజలనుంచి వినతులు స్వీకరించారు. వాస్తవానికి ప్రజాదర్బార్ అధికారిక కార్యక్రమం. ప్రజలు తమ సమస్యలను తెలుపుకొనేందుకు వచ్చే అవకాశమున్నందున పార్టీలకతీతంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలి. వేదికను ఏదోఒక ప్రభుత్వ కార్యాలయంలో ఏర్పాటు చేయాలి. కానీ తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన వేగేశన నరేంద్రవర్మ అవగాహనా లోపమో? అధికార దర్పమో? తెలియదు కానీ కార్యక్రమాన్ని ఏకంగా టీడీపీ కార్యాలయంలోనే ఏర్పాటు చేశారు.



బాపట్ల టీడీపీ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, అధికారులు

అక్రమాలలో కూరుకుపోయి అడుగులకు మడుగులు

ప్రధానంగా మున్సిపల్ కమిషనర్ నిర్మల్‌కుమార్ వ్యవహారం జిల్లా కేంద్రంలో మరింత చర్చనీయాంశంగా ఉంది. ఇటీవల రియల్ ఎస్టేట్ వివాదం నేపథ్యంలో మున్సిపల్ అధికారులు కొందరు రియల్టర్ల నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలు వెల్లు వెత్తడం, అధికారులు వసూలు చేసిన డబ్బులు తిరిగి ఇప్పించమని ఏకంగా ఎమ్మెల్యేనే చెప్పడం మరింత వివాదంగా మారింది. అధికారులు, కొందరు ప్రజాప్రతినిధులు కలిసి అక్రమ దందాలకు పాల్పడుతున్నట్లు ఈ వ్యవహారం తేట తెల్లం చేస్తోంది. ఇదే క్రమంలో అక్రమాలలో కూరుకుపోయిన కొందరు అధికారులు బదిలీలకు భయపడి పచ్చపార్టీ ప్రజాప్రతినిధి చెప్పినట్లు వినాల్సి వస్తోందని, అందులో భాగంగానే అధికారులు ఎమ్మెల్యే హుకుం జారీచేయగానే టీడీపీ కార్యాలయంలో జరిగిన ప్రజాదర్బార్‌కు వెళ్లారని గుసగుసలు వినిపిస్తున్నాయి. మొత్తంగా బాపట్ల ఎమ్మెల్యే టీడీపీ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించడం ఇప్పుడు జిల్లాలోనే హాట్ టాపిక్‌గా మారింది.

హాట్‌టాపిక్‌గా వ్యవహారం..

బాపట్ల ఎమ్మెల్యేవరకు కార్యక్రమాన్ని ఎక్కడ ఏర్పాటు చేసుకున్నా ఎవరికీ అభ్యంతరం ఉండదు. కానీ ఈ కార్యక్రమానికి ప్రభుత్వశాఖల అధికారులు హాజరయ్యారు. వారంతా పార్టీ కార్యాలయంలోనే పార్టీ కార్యకర్తల్లా వినతులు స్వీకరించడం చర్చనీయాంశమైంది. అధికారిక కార్యక్రమాన్ని పార్టీ కార్యక్రమంగా నడపడం బాపట్లలో అటుపార్టీ ఇటు అధికారవర్గాల్లో హాట్‌టాఫిక్‌గా మారింది. టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌కు అధికారులు హాజరవడం జిల్లాస్థాయి అధికారుల్లోనూ చర్చనీయాంశమైంది.

జాతీయ వాటర్‌పోలో పోటీలకు ఎంపిక



ఉప్పాల దోనాల్డ్ వెంకట్‌గౌడ్

బాపట్ల: జాతీయ వాటర్ పోలో పోటీలకు ఉప్పాల డోనాల్డ్ వెంకట్ గౌడ్ ఎంపికయ్యారు.

ఈ నెల 18వతేదీ నుంచి 77వ వాటర్ పోలో నేషనల్ అక్వాటిక్ చాంపియన్‌షిప్ పోటీలు కేరళ త్రివేండ్రంలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ఇంటర్నేషనల్ క్వాటిక్ కాంప్లెక్స్ లో జరగనున్నాయి. ఈపోటీలలో రాష్ట్రం నుంచి 13 మంది యువకులు పాల్గొంటున్నారు. వీరిలో బాపట్ల పట్టణానికి చెందిన ఉప్పాల డోనాల్డ్ వెంకట్ గౌడ్ ఎంపిక అయ్యాడు. ఈ సందర్భంగా జిల్లాకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు అభినందించారు.

రైలు కిందపడి గుర్తుతెలియని వృద్ధుడు మృతి



చీరాల రూరల్: గూడ్స్ రైలు కింద పడి గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందిన సంఘటన బుధవారం మధ్యాహ్నం స్టువర్టుపురం రైల్వే స్టేషన్ సమీపంలో చోటు చేసుకుంది. జీఆర్పీ ఎస్ఐ సి.హెచ్. కొండయ్య తెలిపిన వివరాల మేరకు.. స్టువర్టుపురం రైల్వేస్టేషన్ వద్ద ఓ వృద్ధుడు రైలు కిందపడి మృతి చెందాడనే సమాచారంతో పరిశీలించినట్లు చెప్పారు. మృత దేహం వద్ద ఎటువంటి సమాచారం లభించలేదు. మృతుని వయస్సు సుమారు 70 నుంచి 75 ఏళ్లు ఉంటాయి. ఎత్తు 5.5 ఉంటాయని, చామనఛాయతో బట్టతల కలిగి, ఛాతీపై పుట్టుమచ్చ ఉందని, మృతుని శరీరంపై టెరీకాటన్ తెలుపు లాల్చీ, నీలం, నలుపు రంగు గళ్ల లుంగీ ఉందని తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృత దేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వివరాలు తెలిసినవారు 9440627646 నంబరులో సంప్రదించాలని సూచించారు.

పాము కాటుకు రైతుబలి



మృతుడు నాగేశ్వరరావు

బల్లికురవ: పొలం పనులకు వెళ్లిన వ్యక్తి పాము కాటుతో మృతిచెందిన ఘటన మండలంలోని గుంటుపల్లిలో మంగళవారం అర్ధరాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన చల్లగుండ్ల నాగేశ్వరరావు (55) మంగళవారం పొలం పనుల కోసం వెళ్లి తిరిగి ఇంటికి వచ్చిన మూడు గంటల తరువాత నోటి నుంచి నురగ రావడంతో పాము కాటువేసినట్లు గుర్తించి ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అతను మృతిచెందాడు. మృతునికి భార్య, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు ఉన్నత చదువుకు అమెరికా వెళ్లడంతో అతను వచ్చాక గురువారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఐటీఐ కళాశాలలో మిగిలిన సీట్లకు కౌన్సెలింగ్

నిజాంపట్నం: నిజాంపట్నం ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ విడతల కౌన్సెలింగ్ అనంతరం మిగిలిన ఖాళీలలో చేరేందుకు అర్హులైన విద్యార్థులు వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.సుధాకర్‌బాబు కోరారు. అర్హులైన విద్యార్థులు ఈ నెల 26వ తేదీలోపు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ దరఖాస్తు ఫారంతో పాటు తమ ఒరిజినల్ సర్టిఫికెట్‌లు, రెండు జిరాక్స్ కాపీలు, మూడు పాస్‌పోర్టు ఫొటోలతో 27వతేదీన కళాశాలకు హాజరుకావాలని, 28న కౌన్సెలింగ్ ఉంటుందని చెప్పారు. పూర్తి వివరాలకు 9849479524 నంబరులోగాని, కళాశాలలోగాని సంప్రదించాలన్నారు.

బాధితులను ఆదుకునేందుకు సిద్ధం

జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల: భారీ వర్షాలు, వరద విపత్తుతో నష్టపోయిన కుటుంబాలకు ఈనెల 20వ తేదీన నష్టపరిహారం పంపిణీకి సిద్ధంగా ఉంచామని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి పేర్కొన్నారు. రాష్ట్ర చీఫ్ సెక్రటరీ నీరబ్ కుమార్ ప్రసాద్ ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడారు. తీర ప్రాంతమైన బాపట్ల జిల్లాలో 7,970 గృహాలు జలదిగ్బంధంలో చిక్కుకుని దెబ్బతిన్నాయని జిల్లా కలెక్టర్ సీఎస్ దృష్టికి తీసుకువెళ్లారు. విపత్తుతో 3 మండలాల్లోని 24 గ్రామాలు నీట మునిగి దెబ్బతిన్నాయన్నారు. 30 వేల మంది నిర్వాసితులయ్యారని కలెక్టర్ తెలిపారు. 194 గృహాలు పాక్షికంగా దెబ్బతిన్నాయని, 214 కచ్చాగృహాలు, 245 పూరిల్లు దెబ్బతిన్నట్లు వివరించారు. 438 గేదెల షెడ్లు దెబ్బ తిన్నాయని చెప్పారు. నష్టపోయిన కుటుంబాలలో నాలుగు యానాది కుటుంబాలకు ఆధార్ కార్డులు, బ్యాంక్ ఖాతాలు లేవని సీఎస్‌కు వివరించారు. బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రకటించిన మేరకు అత్యవసరంగా జిల్లాకు రూ.7.09 కోట్లు నిధులు కావాలని విన్నవించారు. పంట నష్టం వివరాలను లిఖితపూర్వకంగా నివేదిక పంపుతామని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా నుంచి జేసీ ప్రఖర్ జైన్, డీఆర్‌ఓ సిహెచ్ సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

నిద్రిస్తున్న వ్యక్తిని కర్రతో మోది హత్య

- తన భార్యతో మాట్లాడవద్దన్నందుకు ఘాతుకం
- కొల్లూరు మండలం పోతార్లంకలో ఘటన



హతుడు శ్రీరామకృష్ణ (ఫైల్)



సిమెంట్ బల్లపై శ్రీరామకృష్ణ మృతదేహం.. వివరాలు నమోదు చేసుకుంటున్న ఏఎస్ఐ రామయ్య

కొల్లూరు: నిద్రిస్తున్న వ్యక్తిని గుదిబండ లాంటి కర్రతో మోది హత్య చేసిన సంఘటన మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని పోతార్లంకకు చెందిన దంతాల శ్రీరామకృష్ణ (32) అలియాస్ శ్రీరామయ్య ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. వివాహమై చిన్నారులైన ఓ కుమారుడు, కుమార్తె ఉన్న అతని భార్య గత ఆరునెలలుగా అనారోగ్య కారణంతో పుట్టింటికి వెళ్లి ఉంటోంది. గతంలో తన భార్యతో స్థానికంగా నివాసం ఉంటున్న విష్ణుమొలకల పవన్‌సాయి అలియాస్ కువైట్ పలుమార్లు మాట్లాడటాన్ని శ్రీరామకృష్ణ గమనించాడు. పవన్‌సాయిని పద్ధతి మార్చుకోవాలని, తన భార్యతో మాట్లాడటం మానుకోవాలని మందలించాడు. అయినప్పటికీ పవన్‌సాయి శ్రీరామకృష్ణ భార్యతో మాట్లాడటానికి యత్నిస్తుండటంతో సక్రమంగా ఉండాలని హెచ్చరించాడు. దానిపై పగ పెంచుకున్న పవన్‌సాయి మంగళవారం అర్ధరాత్రి స్థానిక సచివాలయం వద్దనున్న రామకృష్ణ హోటల్ ఎదురుగా ఉన్న పంచాయతీ సిమెంట్ బల్లపై పడుకొని నిద్రిస్తున్న శ్రీరామకృష్ణను గమనించి, తనకు అందుబాటులో దొరికిన గుదిబండ లాంటి లావుపాటి కర్ర తీసుకొచ్చి నిద్రిస్తున్న వ్యక్తి తలపై బలంగా మోదడంతో శ్రీరామకృష్ణ నిద్రలోనే మృతి చెందాడు. అనంతరం నిందితుడైన పవన్‌సాయి మృతుడి తమ్ముడు విజయ్‌కుమార్‌కు ఫోన్ చేసి తాను ఒక వ్యక్తిని హత్యచేశానని చెప్పి అక్కడ నుంచి ఉడాయించాడు. తన సోదరుడు అర్ధరాత్రి 12 దాటినా ఇంటికి చేరుకోకపోవడంతో ఫోన్ చేసినా సమాధానం రాకపోవడంతో అనుమానంతో పంచాయతీ కార్యాలయం వద్దకు వచ్చి చూసేసరికి శ్రీరామకృష్ణ రక్తపు మడుగులో పడిఉండటం గమనించాడు. స్థానికుల సహకారంతో కొల్లూరు పోలీసులకు సమాచారం అందించడంతో వేమూరు సీఐ పీవీ ఆజంనేయులు నేతృత్వంలో కొల్లూరు ఎస్ఐ జి.ఏడుకొండలు సంఘటనా ప్రాంతానికి చేరుకొని హత్యకు గల కారణాలపై విచారణ చేపట్టారు. మృతుడి సోదరుడు విజయ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

● హత్యకు పవన్‌సాయి కారణమని నిర్ధారించుకున్న పోలీసులు అతనితో రాత్రి ఉన్న వ్యక్తులను అదుపులోకి తీసుకొని కొల్లూరు పోలీసు స్టేషన్‌కు తరలించి విచారించారు. అయితే అతనితో ఉన్న వ్యక్తులను పోలీసు స్టేషన్‌కు తరలిస్తున్న క్రమంలో నిందితుడైన పవన్‌సాయి దోనేపూడి శివారు ఆలపాటినగరం వద్ద నడుచుకుంటూ వెళుతుండటం గమనించిన వ్యక్తులు తమతో ఉన్న పోలీసులకు సూచించడంతో అతనిని అదుపులోకి తీసుకొన్నట్లు మృతుడి బంధువులు, పోతార్లంక వాసులు పేర్కొంటున్నారు. నిందితుడి అరెస్టును పోలీసులు ఇంకా నిర్ధారించలేదు.

చిన్నారులపై లైంగికదాడి, అసభ్యప్రవర్తన

నిందితుడిపై పోక్సో కేసు నమోదు

ఇంకొల్లు (చినగంజాం): ఆడ, మగ తేడాలేకుండా చిన్నపిల్లలపై లైంగికదాడికి పాల్పడుతూ వారిని బెదిరింపులకు గురిచేస్తున్న ప్రబుద్ధుడి ఘటన బాపట్ల జిల్లా ఇంకొల్లు మండలం ఇడుపులపాడులో వెలుగులోకి వచ్చింది. బాధితులు, పోలీసులు తెలిపిన సమాచారం మేరకు మండలంలోని ఇంకొల్లుకు చెందిన 14 ఏళ్ల బాలుడు ప్రైవేటు స్కూల్లో చదువుతున్నాడు. అతడు స్కూల్ నుంచి ఇంటికి వచ్చాక గ్రామంలోని ట్యూషన్‌కు వెళ్తుంటాడు. మంగళవారం సాయంత్రం అదేవిధంగా ట్యూషన్‌కు వెళ్లిన బాలుడిని ట్యూషన్ టీచర్ ఇద్దరు పిల్లలు రాలేదని, పిలుచుకుని రమ్మని పంపాడు. బాలుడు గ్రామంలోని వారి ఇళ్లకు వెళ్తుండగా గ్రామానికి చెందిన చప్పిడి బుల్లిపున్నయ్య (45) అతనిని గ్యాస్ సిలిండర్ తీసుకొద్దాం ద్విచక్ర వాహనం ఎక్కమని చెప్పి గ్రామ సమీపంలోని చెరువు వద్ద ఉన్న పొలాల్లోకి తీసుకెళ్లాడు. అతడికి సెల్‌ఫోన్ ఇచ్చి చూస్తుండమని చెప్పి అతని ప్యాంట్ విప్పుతూ లైంగిక దాడికి యత్నించాడు. ఆ సమయంలో బాలుడు అప్రమత్తమై అతని నుంచి తప్పించుకుని పొలాల్లో అతనికి చిక్కకుండా పరుగులు తీశాడు. అతని దగ్గరే ఉన్న సెల్‌ఫోన్ ద్వారా అతని బాబాయ్‌కి ఫోన్ చేసి జరిగిన విషయం చెప్పి తాను ఉన్న ప్రాంతం గురించి వివరించాడు. ఘటనా స్థలానికి చేరుకున్న బంధువులు అతడిని తీసుకొని వెళ్లారు. ఈలోగా బుల్లిపున్నయ్య తప్పించుకుని అక్కడి నుంచి పరారయ్యాడు.

● ఇదిలా ఉండగా వారం రోజుల క్రితం తల్లిదండ్రులకు దూరంగా ఉంటున్న అంకిరెడ్డిపాలేనికి చెందిన సరిగా మాటలు రాని ఓ బాలుడిపై కూడా లైంగిక దాడి చేయడంతో పాటు ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరించాడు. అదేవిధంగా గ్రామానికి చెందిన ఓ బాలికను పాఠశాలకు వెళ్తుండగా అసభ్యంగా ప్రవర్తించి ఎవరికీ చెప్పొద్దని బెదిరించాడు. బుల్లిపున్నయ్యకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నట్లు సమాచారం.

నిందితుడి ఇంటివద్ద నిరసన..

సంఘటన సమాచారం తెలుసుకున్న బాలుని కుటుంబ సభ్యులతో కలిసి గ్రామ ప్రజలు మంగళవారం రాత్రి బుల్లిపున్నయ్య ఇంటి వద్దకు చేరి గ్రామంలో లైంగిక దాడులకు పాల్పడుతున్న అతనిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేశారు. విషయం తెలుసుకున్న ఇంకొల్లు సీఐ రమణయ్య, ఎస్ఐ సురేష్‌లు సంఘటనా స్థలానికి చేరుకొని ఆందోళన విరమింపజేసేందుకు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. బుల్లి పున్నయ్యను తమకు అప్పగించేవరకు ఆందోళన విరమించబోమని భీష్మించుకు కూర్చున్నారు. సీఐ రమణయ్య బాధిత కుటుంబ సభ్యులకు లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తిపై చర్యలు తీసుకుంటామని 24 గంటలు లోగా అతనిని పట్టుకుంటామని హామీ ఇవ్వడంతో రాత్రి 11 గంటల తరువాత వారు ఆందోళన విరమించారు.

పోక్సో కేసు నమోదు..

ఇడుపులపాడు గ్రామంలో చిన్నపిల్లలతో అసభ్యంగా ప్రవర్తిస్తూ, లైంగికదాడులకు పాల్పడిన బుల్లిపున్నయ్య పరారీలో ఉన్నాడని, అతడిని వెంటనే గుర్తించి అతనిపై సత్వరం చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. అతనిపై పోక్సో కేసు నమోదు చేస్తున్నట్లు సీఐ రమణయ్య తెలిపారు.

ఇండియన్ బ్యాంక్
భువనంవారిపాలెం బ్రాంచ్, డి.నం. 10-40, రెడ్డిపాలెం సెంటర్, భువనంవారిపాలెం, పిట్టలవానిపాలెం మండలం, బాపట్ల జిల్లా – 522 311.

ఆభరణాల కొరకు వేలం ప్రకటన

మా బ్యాంక్ వద్ద తాకట్టుపెట్టిన ఆభరణాలను విడిపించుకొనలేదు / రుణగ్రహీతకు ముందస్తు సమాచారం పంపినప్పటికీ చెల్లించలేదు. అందువలన, **ఇండియన్ బ్యాంక్, భువనంవారిపాలెం బ్రాంచ్ వద్ద 09-10-2024న సా. 4.00 గం.కు** తాకట్టుపెట్టిన ఆభరణాలు ఎక్కడ ఎలా ఉన్నవి అక్కడ అలా ప్రాతిపదికన వేలం వేయబడును.

రుణగ్రహీత పేరు మరియు చిరునామా : మోదుగుల వీరారెడ్డి తండ్రి మోదుగుల బసివిరెడ్డి, డి.నం. 1-27, చోడిపాలెం గ్రామం, పిట్టలవానిపాలెం మండలం, బాపట్ల జిల్లా.

క్ర. సం.	రుణ ఖాతా నం.	అడ్వాన్స్ తేదీ	18.09.2024 నాటికి బకాయి మొత్తం	స్థూల బరువు (గ్రాములలో)
1	6939798747	23-10-2020	Rs.1,25,587/-	49.00
2	6939747113	23-10-2020	Rs.90,736/-	43.20
3	6939789200	23-10-2020	Rs.97,701/-	39.80
4	6939786107	23-10-2020	Rs.83,764/-	32.00

పైన తెలిపిన వ్యక్తి ఈ నోటీసు ప్రచురణ తేదీ నుండి 15 రోజులలోగా మొత్తాన్ని తిరిగి చెల్లించాలి. లేనిచో బ్యాంక్ ఆభరణాలను వేలం వేస్తుంది మరియు రుణం, దానిపై వడ్డీ మరియు ఇతర ఖర్చుల కొరకు మొత్తాన్ని వినియోగిస్తుంది.

వేలం నిబంధనలు : 1) ఆభరణాల నాణ్యత కొరకు బ్యాంక్ బాధ్యత వహించదు. ఆభరణాలు ఉన్నవి ఉన్నట్లుగా వేలం వేయబడతాయి. ఆభరణాలను తాకట్టుపెట్టినవారు మరియు బిడ్‌లో గెలిచినవారు పై దానికి బాధ్యులవుతారు. 2) ఏ కారణాలు తెలుపకుండా వేలం దరఖాస్తును తిరస్కరించుటకు హక్కు బ్యాంకుకు కలదు. 3) వేలంలో పాల్గొనుటకు ఆసక్తిగల వ్యక్తులు తెలిపిన టైమ్ షెడ్యూల్ ప్రకారం వేలం తేదీన ఒక ఫోటోగ్రాఫ్ మరియు చెల్లుబాటగు ఫొటో గుర్తింపు రుజువు మరియు చిరునామా రుజువుతో పాటు చెల్లుబాటగు పాన్ కార్డ్ తీసుకురావాలి. 4) వేలంలో పాల్గొనుటకు ఆసక్తి గల వారు 09.10.2024న మ. 3.00 గం.లోగా వాపసు చేయబడే డిపాజిట్ రూ. 5000/- చెల్లించి రశీదు పొందాలి. వేలం అదే రోజున సా. 4.00 గం.కు ఇండియన్ బ్యాంక్, భువనంవారిపాలెం బ్రాంచ్ వద్ద జరుగుతుంది.

తేది : 19.09.2024 సం/- బ్రాంచ్ మేనేజర్
ప్రదేశం : బాపట్ల జిల్లా ఇండియన్ బ్యాంక్

రేపు ఏబీఆర్ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా

రేపల్లె రూరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఉపాధి కార్యాలయం, సీడాప్, ఏబీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీన ఏబీఆర్ కళాశాల ఆవరణంలో జాబ్‌మేళా కార్యక్రమం నిర్వహించనున్నామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టీసీ రవిచంద్ర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రిలయన్స్ ట్రెండ్స్, డిక్సన్, అపెక్స్ సొల్యూషన్స్ కంపెనీల ఆధ్వర్యంలో నిర్వహించే ఇంటర్వ్యూలలో 90కి పైగా ఖాళీలు భర్తీ చేయబడతాయన్నారు. వేతనం అభ్యర్థుల విద్యార్హతను బట్టి రూ.10,000 నుంచి రూ.15,000 వరకు ఉంటుందన్నారు. టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, డిప్లొమా, ఎమ్మెస్సీ, ఎంబీఏ, విభాగాలలో ఏదైన విద్యను అభ్యసించిన, 18 నుంచి 35 సంవత్సరాల వయసు కలిగిన నిరుద్యోగ యువతీ యువకులు జాబ్‌మేళాకు హాజరవ్వాలన్నారు. అభ్యర్థులు తమ సర్టిఫికెట్‌ల జిరాక్స్, ఆధార్ నకలు, పాస్‌పోర్ట్ ఫొటోలతో నేరుగా ఇంటర్వ్యూకు హాజరుకావాలన్నారు. పూర్తి వివరాలకు 9347468946 నంబరులోగానీ, కార్యాలయంలోని సి.హెచ్.రవి కుమార్‌ను సంప్రదించాలన్నారు.